బతుకమ్మ సింగారం.. అనుబంధాల జీవనం!



కేజీబీవీలో బతుకమ్మ ఆడుతున్న ఎస్‌వో మున్నీ, సీఆర్టీలు, విద్యార్థినులు

రంగు రంగుల పూలను ఒక దగ్గరకు చేర్చి పేర్చితే అందాలొలికే బతుకమ్మ సాక్షాత్కరిస్తుంది. ఇలాగే మనమందరం కలిసి మెలిసి ఉంటే బంధాలు, అనుబంధాలతో మన జీవితం కూడా గుబాళిస్తుందంటూ డోర్నకల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం ముందస్తు బతుకమ్మ సంబురం నిర్వహించారు.

– న్యూస్‌టుడే, డోర్నకల్

కష్టేఫలి..!

డీఎస్సీలో మెరిశారు.. అనుకున్నది సాధించారు!

'డీఎస్సీ-2024లో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన మంగళవారం నుంచి ఉంటుంది. సరైన ధ్రువపత్రాలతో హాజరుకావాలి. పూర్తి వివరాలకు డీఈవో కార్యాలయంలో సంప్రదించాలి'

న్యూస్‌టుడే యంత్రాంగం

కల నెరవేరింది.. కష్టానికి ఫలితం దక్కింది. డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎన్నో ఏళ్లుగా వీరు ఎదురుచూశారు. ఇతర అవకాశాలు ఉన్నా కాదనుకున్నారు. ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడంతో దీక్షగా చదివి చివరికి అనుకున్నది సాధించారు. ప్రభుత్వం సోమవారం వెల్లడించిన డీఎస్సీ ఫలితాల్లో సబ్జెక్టుల వారీగా జిల్లాల్లో మొదటి, రెండో ర్యాంకులు సాధించిన వారి స్ఫూర్తిదాయక కథనం..



రాజశేఖర్

కొత్తగూడ మండలం కుందనపల్లికి చెందిన మద్దెల లక్ష్మీనారాయణ, సుభద్రల కుమారుడు రాజశేఖర్ లాంగ్వేజ్ పండిట్ హిందీ సబ్జెక్టులో 65.53మార్కులు సాధించిన జిల్లా ప్రథమ స్థానంలో నిలిచారు. పేదింటి ఆదివాసీ కుటుంబానికి చెందిన రాజేశేఖర్ గురుకులంలో కాంట్రాక్టు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ గతేడాది ప్రకటించిన గురుకుల ఉపాధ్యాయుల ఉద్యోగాల్లో ఎంపికయ్యాడు. ప్రస్తుతం వరంగల్ జిల్లా గిర్నిబావిలోని ఎంజేపీఎస్ గురుకులంలో హిందీ పండిట్‌గా పనిచేస్తున్నారు. – కొత్తగూడ



నిడిగంటి సునీల్

మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం చిన్ననాగారం గ్రామానికి చెందిన నిడిగంటి సునీల్ స్కూల్ అసిస్టెంట్ భౌతికశాస్త్రంలో 77.83 మార్కులు సాధించి మహబూబాబాద్ జిల్లా ప్రథమ ర్యాంకు సాధించారు. సునీల్ ప్రస్తుతం మహత్మా జ్యోతిబా పులే సంక్షేమ గురుకుల పాఠశాలలో భౌతికశాస్త్రం బోధిస్తున్నాడు. – ఇనుగుర్తి

☛ మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని దుబ్బతండాకు చెందిన గుగులోతు నిఖిల్ స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్ విభాగంలో జిల్లా ప్రథమర్యాంక్ సాధించారు. ప్రస్తుతం పెద్దవంగర మహాత్మాజ్యోతిబాపులే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. – తొర్రూరు

ఒకేసారి మూడు ఉద్యోగాలు..



మామిడి మహేశ్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని గిద్దెముత్తారం గ్రామానికి చెందిన మామిడి మహేశ్ మూడు ఉద్యోగాలు సాధించి మురిపించారు. తెలుగు పండిట్ విభాగంలో 80.90 మార్కులతో జిల్లా మొదటి ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ తెలుగులో 76.40 మార్కులతో జిల్లా మూడో ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ సోషల్‌లో 73.40 మార్కులతో జిల్లా ఐదో ర్యాంకు సాధించారు. మహేశ్ ప్రస్తుతం ప్రభుత్వ గురుకుల టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తండ్రి సమ్మయ్య, కుటుంబ సభ్యులు, గురువుల ప్రోత్సాహంతో మంచి ఫలితం సాధించేందుకు కారణమైందని ఆయన చెప్పారు. – చిట్యాల

పీడీ, పీఈటీ సైతం..



నేతుల రాజు

వరంగల్ జిల్లా సంగెం మండలం మొండ్రాయికి చెందిన నేతుల రాజు డీఎస్సీలో ప్రథమ ర్యాంకు సాధించి ఫిజికల్ డైరెక్టర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. – సంగెం

దంపతులు సాధించారు



నాగలక్ష్మి, వినయ్ దంపతులు

వరంగల్ జిల్లా నల్లబెల్లికి చెందిన కొండ్లె నాగలక్ష్మి, వినయ్ దంపతులు డీఎస్సీలో ప్రతిభ చాటారు. వినయ్ జిల్లాస్థాయిలో ఏడో ర్యాంకు, నాగలక్ష్మి 54వ ర్యాంకు సాధించారు.



ప్రవళిక

☛ నల్లబెల్లికి చెందిన మూటికె ప్రవళిక 83.20 మార్కులతో జిల్లాస్థాయిలో రెండో ర్యాంకు సాధించి సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టుకు ఎంపికయ్యారు. రాజిత, రాజులు ఆమె తల్లిదండ్రులు. వారిది వ్యవసాయ కుటుంబం. – నల్లబెల్లి



ఎండీ ఫర్జాన

● వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన ఎండీ ఫర్జాన స్కూల్ అసిస్టెంట్ హిందీ విభాగంలో 65.67 మార్కులు సాధించారు. సిద్ధిపేట జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. రెండు నెలల క్రితం హిందీ విభాగంలో జేఎల్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. – దుగ్గొండి

ఉద్యోగం వదులుకొని..



శ్వేత

వరంగల్ జిల్లా ఖానాపురం మండలం రాగంపేట గ్రామంలోని వ్యవసాయ కుటుంబంలో పుట్టి పెరిగిన ఎలగందుల శ్వేత మొదటి ర్యాంక్ సాధించారు. ప్రస్తుతం హనుమకొండ వికాస్‌నగర్‌లో ఉంటున్న ఆమె బీఎస్సీ, డీఈడీ చదివారు. ఎస్జీటీ విభాగంలో 100 మార్కులకు గాను 83.37 మార్కులు సాధించారు. గతంలో నల్లబెల్లి మండలంలో పంచాయితీ కార్యదర్శి ఉద్యోగం సాధించిన ఆమె.. ఆ ఉద్యోగం వదులుకొని ఉపాధ్యాయ వృత్తిపై ఉన్న ఆసక్తితో డీఎస్సీ రాశారు. భర్త శ్రీకాంత్ ఎస్సైగా పనిచేస్తున్నారు. – రంగశాయిపేట, ఖానాపురం



మేడి నాగరాజు

నెక్కొండ: నెక్కొండకు చెందిన మేడి నాగరాజు డీఎస్సీ (తెలుగు లాంగ్వేజ్ పండిట్)లో మహబూబాబాద్ జిల్లాలో 70.17 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు. నిరుపేద కుటుంబానికి చెందిన నాగరాజు ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలోని ప్రభుత్వ పాఠశాలలో చదివారు.

కష్టాలు ఎదుర్కొని..



గడ్డం ఫణీంద్ర

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఒడిపిలవంచ గ్రామానికి చెందిన గడ్డం ఫణిందర్ జిల్లా 3వ ర్యాంకు సాధించాడు. తండ్రి వైకుంఠం ఏడాది కిందట మృతి చెందగా తల్లి పద్మ గ్రామంలో రేషన్ డీలర్‌గా పనిచేస్తున్నారు. గతేడాది డిసెంబర్‌లో స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నియామకాల్లో మల్టీ టాస్కింగ్ స్టాఫ్ ఉద్యోగం సాధించాడు. డీఎస్సీ నోటిఫికేషన్ రావడంతో ఉద్యోగానికి సెలవుపెట్టి పట్టుదలతో చదివి ఉన్నత ర్యాంకు సాధించాడు. గ్రూప్-4లోనూ జిల్లాలో 13వ ర్యాంకు తెచ్చుకున్నారు. – కాటారం

'విద్యుత్తు' వసూళ్లపై అధికారుల ఆరా

ఈనాడు కథనానికి స్పందన

మహబూబాబాద్, న్యూస్‌టుడే: 'విద్యుత్తు కనెక్షన్ల పేరిట దళారుల దందా' శీర్షికన సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఎన్‌పీడీసీఎల్ అధికారులు స్పందించారు. వసూళ్లపై ఆ శాఖ విజిలెన్స్ అధికారులు సోమవారం ఆరా తీశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న నిరుపేదల నుంచి ఇంటి నెంబర్లతో సంబంధం లేకుండా షరతులతో కూడిన విద్యుత్ మీటర్ల ఏర్పాటుకు కొందరు దళారులు డబ్బులు వసూలు చేస్తున్నారు. దీనిపై కథనం రావడంతో పట్టణంలోని వివిధ కాలనీలకు వెళ్లిన విద్యుత్తు అధికారులు దరఖాస్తుదారులతో మాట్లాడారు. వారు అందించిన వివరాలను సేకరించారు. సిగ్నల్ కాలనీకి చెందిన ఓ మహిళ నుంచి అదే ప్రాంతానిరి చెందిన భట్టు దేవ్ సింగ్ అనే వ్యక్తి అధిక మొత్తం డబ్బులు తీసుకున్నాడని, ఆ తర్వాత ఉత్తిదే అని తెలిసి అడిగితే అతడు బెదిరించాడని ఆమె పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరికొన్ని ప్రాంతాల్లో కూడా రూ.వంద, రూ.రెండొందలు వసూలు చేసినట్లు తెలుసుకున్న అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందిని విచారించారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు, మీటరు ఏర్పాటు దరఖాస్తులకు, అవసరమైన ఇతర ధ్రువీకరణ పత్రాలకు డబ్బులు తీసుకున్నట్లు ఉన్నతాధికారులకు చెప్పినట్లు సమాచారం. విద్యుత్తు మీటర్ల ఏర్పాటుకు 500 వాట్స్ కంటే తక్కువ ఉన్నట్లయితే రూ. 938 చెల్లించాలని అంతకంటే ఎక్కువగా ఎవరికీ ఇవ్వవద్దని ఆ శాఖ ఎస్ఈ జె.నరేష్, డీఈ విజయ్ వేర్వేరు ప్రకటనల్లో వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు. సిబ్బంది డబ్బులు అడిగితే 79010 93938 నంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. మధ్యవర్తులు అవసరం లేదని దరఖాస్తుదారులు నేరుగా రుసుం చెల్లించాలన్నారు.

సమావేశాలేనా.. సమస్యలు పరిష్కరించేది ఉందా!

మహబూబాబాద్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రమైన మహబూబాబాద్ పట్టణంలో వివిధ అభివృద్ధి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. వివిధ పథకాల ద్వారా రూ.కోట్ల నిధులు మంజూరవగా, కొన్ని పనులు ప్రారంభం కాకపోగా మరికొన్ని ప్రారంభించి మధ్యలోనే వదిలివేశారు. చేసిన పనులకు బిల్లులు రావడం లేదంటూ గుత్తేదారులు పనులు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. కొత్త పనులకు ఆమోదం లభించడం లేదు. మంగళవారం నిర్వహించే సర్వసభ్య సమావేశానికి హాజరవుతున్న ప్రజాప్రతినిధులు సమావేశం నిర్వహించి వదిలేస్తారా లేదా సమస్యల పరిష్కారానికి నిధులు తీసుకొస్తారా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

కొట్టుకు పోయిన అంతర్గత రహదారి



స్నేహనగర్‌లో ఇటీవల కురిసిన వర్షాలతో దెబ్బతిన్న అంతర్గత రహదారి

పై ఫొటోలో కనిపిస్తున్న అంతర్గత రహదారి పట్టణంలోని స్నేహనగర్‌లో ఉంది. ఇటీవల కురిసిన వర్షాలతో నిజాం చెరువు మత్తడి నుంచి వచ్చిన వరద ప్రవాహంతో రహదారి పూర్తిగా కొట్టుకుపోయింది. సుమారు యాభైకి పైగా ఉన్న ఇళ్లలోకి వెళ్లాలంటే ఆ ప్రాంతవాసులు ఇబ్బందులు పడుతున్నారు.

నిచ్చెన ఎక్కితేనే.. ఇంట్లోకి



జిల్లా కేంద్రంలోని నెహ్రూ సెంటర్ నుంచి పత్తిపాక మీదుగా రజాలిపేటకు వెళుతున్న రహదారి విస్తరణ పనుల్లో అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయ లోపంతో ముందుకు సాగడం లేదు. రహదారి మధ్య నుంచి సమానంగా రహదారులకు ఇరువైపులా కొన్ని ఇళ్లు కూలగొట్టి, మరికొన్ని ఇళ్లను తొలగించలేదు. దీంతో పనులకు అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఈ రోడ్‌లో ఉన్న ఓ కొరియర్ సంస్థ నిర్వాహకులు రవికుమార్-శైలజ దంపతులు తమ కార్యాలయం పక్కనే ఉన్న ఇంటి మొదటి అంతస్తులో అద్దెకు ఉంటున్నారు. రహదారి పూర్తవుతుందని ఇంటిపైకి వెళ్లే మెట్లను తొలగించారు. విస్తరణ కొలతల్లో వచ్చిన వివాదాలతో పనుల్లో పురోగతి లేదు. మొదటి అంతస్తులో ఉండే ఇంట్లోకి వెళ్లేందుకు ఈ దంపతులు నిత్యం ప్రమాదకర పరిస్థితుల్లో నిచ్చెన ఎక్కి దిగాల్సి వస్తుంది. ఆరు నెలలుగా ఇదే పరిస్థితి.

● రూ. 7 కోట్ల అంచనావ్యయంతో ప్రారంభించిన మోడల్ మార్కెట్ పనులు పూర్తి కాలేదు. దోబీఘాట్లు, ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఈదులపూసపల్లి రహదారుల విస్తరణ, రూ.5 కోట్లతో ప్రారంభించిన పురపాలక సంఘం కార్యాలయం, 36 వార్డుల్లో సీసీ రోడ్లు, సీసీ కాలువలు, వైకుంఠధామాలు పూర్తి కాలేదు. ఇండోర్ స్టేడియం, కళామందిరం పనులు ప్రారంభించలేదు.

గంటల వ్యవధిలో తండ్రిని, భర్తను కోల్పోయిన గృహిణి



కృష్ణ

బయ్యారం, న్యూస్‌టుడే: ఓ వైపు కన్న తండ్రి అంత్యక్రియలకు వెళ్లిన గంట వ్యవధిలో మరో వైపు బస్సు ఢీకొని భర్త మృతి చెందిన విషాద ఘటనతో ఓ మహిళ విషాద ఉదంతం ఇది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గౌరారం గ్రామానికి చెందిన సింగరబోయిన కృష్ణ(42) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయన భార్య సరిత ఆదివారం రాత్రి మృతి చెందిన తండ్రి అంత్యక్రియలకు కురవి మండలం మాదాపురం వెళ్లారు. ఈక్రమంలో ఇంటి వద్ద వ్యవసాయ పనులు చక్కబెట్టుకొని మామ అంత్యక్రియలకు వెళ్లేందుకు కృష్ణ సిద్ధమౌతున్నారు. గౌరారం నుంచి వినోబానగర్ వెళ్లే దారిలో పశువులను పొలం వద్దకు తీసుకెళ్తున్న క్రమంలో కృష్ణను వెనకగా వచ్చిన ఓ ప్రైవేటు పాఠశాల బస్సు ఢీకొట్టింది. ఈప్రమాదంలో కృష్ణ తీవ్రంగా గాయపడ్డారు.. వైద్యం కోసం మహబూబాబాద్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయారు. విషయం తెలుసుకున్న కృష్ణ భార్య సరిత రోదనలు మిన్నంటాయి. అటు తండ్రిని, ఇటు భర్తను కోల్పోయిన ఆమె తనకు, తన ఇద్దరు పిల్లలకు దిక్కెవరంటూ విలపిస్తున్న తీరు గ్రామస్థులను కంటతడి పెట్టించింది.

రైళ్ల రద్దుతో ప్రయాణికుల పాట్లు..

సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలో జరగుతున్న ట్రాక్ మరమ్మతుల కారణంగా పలు రైళ్లు రద్దు అయ్యాయి. దీంతో ప్రయాణికులు సోమవారం ఆర్టీసీ బస్సులను ఆశ్రయించడంతో మహబూబాబాద్ ఆర్టీసీ ప్రయాణప్రాంగణం కిక్కిరిసి కనిపించింది. బస్సుల కోసం ప్రయాణికులు గంటల పాటు నిరీక్షించారు. పరిమితి మించి ఎక్కడమేగాక ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తూ ప్రమాదకర పరిస్థితిలో ప్రయాణాలను కొనసాగించారు.

– న్యూస్‌టుడే, మహబూబాబాద్ టౌన్



ప్రయాణికులతో కిక్కిరిసిన ప్రయాణ ప్రాంగణం



ప్రమాదకరంగా బస్సు మెట్లపై నిల్చొని..



లోపల ఖాళీ లేకున్నా ఎక్కాల్సిందే..

మంసాహార దుకాణాలు తెరవద్దు

మహబూబాబాద్, న్యూస్‌టుడే: గాంధీ జయంతి సందర్భంగా బుధవారం మహబూబాబాద్‌లో మాంసాహార దుకాణాలను తెరవరాదని పురపాలక సంఘం కమిషనర్ నోముల రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. హోటళ్లు, దాబాలు, కర్రీ పాయింట్స్, బిర్యానీ పాయింట్లలో మాంసాహార క్రయ, విక్రయాలు జరపవద్దని నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దయ చూపండి... ఆసరా ఇవ్వండి!

మహబూబాబాద్, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. క్షేత్రస్థాయి అధికారుల నిర్లక్ష్యం, నిరుపేదల అవగాహన రాహిత్యం వల్ల వారికి సంక్షేమ పథకాలు అందడం లేదు. కష్టాల్లో ఉన్నవారికి అధికారుల చేయూత కరవైంది. కలెక్టర్‌ను కలిస్తే తమ సమస్యలు తీరుతాయంటూ వృద్ధులు, దివ్యాంగులు సోమవారం ప్రజావాణికి హాజరై ఆర్థికంగా ఆసరా ఇచ్చి ఆదుకోవాలంటూ వేడుకున్నారు.

పింఛన్ తీసుకోలేదని తొలగించారు..



వీరమ్మ

ఈ చిత్రంలో కనిపిస్తున్న 88 ఏళ్ల వృద్ధురాలి పేరు మలిశెట్టి వీరమ్మ. గార్ల మండలం పుల్లూరుకు చెందిన ఈమె భర్త నారాయణ మృతి చెందగా 2016 నుంచి వితంతు పింఛన్ ప్రతి నెలా ఇచ్చేవారు. ఆరు నెలల క్రితం అనారోగ్యానికి గురికావడంతో మూడు నెలలకు పైగా ఖమ్మంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరచుగా వెళుతూ చికిత్స పొంది ఇంటికి వచ్చింది. పింఛన్ కోసం అధికారుల వద్దకు వెళితే వరుసగా మూడు నెలలు పింఛన్ తీసుకోలేదని జాబితాలో పేరు తొలగించారని, నాకు పింఛనే ఆధారమని వేడుకున్నారు.

రెండేళ్ల నుంచి పింఛను కోసం..



లింగమ్మ

డోర్నకల్ మండలం తోడేళ్ల గూడెం గ్రామానికి చెందిన చల్ల లింగమ్మ అగ్ని ప్రమాదంలో కాళ్లు కాలిపోయి 80 శాతం వైకల్యంతో నడవలేని స్థితిలో ఉంది. నేలపైనే పాకుతూ వెళుతుంది. 2005 నుంచి దివ్యాంగుల పింఛన్ ఇచ్చారు. సదరం సర్టిఫికెట్ గడువు తీరిందని తొలగించారు. 2023 సెప్టెంబరు 30న అధికారులు లింగమ్మకు దివ్యాంగుల ధ్రువీకరణ పత్రం జారీ చేసినా పింఛను రావడం లేదు. నాటి నుంచి ఇప్పటి వరకు కలెక్టరేట్‌కు ఐదారు సార్లు వచ్చి విన్నవించినా ఫలితం లేకుందని మరోసారి కలెక్టర్‌ను కలిసి తన గోడు వెల్లబోసుకుంది.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

ఏడాదైనా రావడంలే..



యశ్వంత్

నర్సింహులపేట మండలం జయపురం గ్రామానికి చెందిన ఈ బాలుడి పేరు శివరాత్రి యశ్వంత్. ఇతను మానసిక దివ్యాంగుడు మే 2023లో సదరం ధ్రువీకరణ పత్రం జారీ చేశారు. దివ్యాంగుల పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటే మంజూరు కాలేదని బాలుడి నానమ్మ, తాత భద్రమ్మ-వెంకన్న ఆవేదన వ్యక్తం చేశారు. కూలీ పనులు చేసుకునే జీవనం సాగించే కుమారుడు, కోడలు వలస వెళ్లి ఈ మనవడిని తమ వద్ద వెళ్లిపోయారన్నారు. తాము కూడా ఏ పనులు చేసే పరిస్థితి లేదని డబ్బులు ఇవ్వకున్నా మనుమడికి పింఛన్ వస్తే అతడికి ఆసరాగా ఉంటుందని అధికారులు వేడుకున్నారు.

అమ్మే.. అన్ని సపర్యలు



జతిన్

పక్క చిత్రంలో కనిపిస్తున్న బాలుడిది కేసముద్రం స్టేషన్ గ్రామం. 10 సంవత్సరాలు వచ్చినా ఇప్పటికీ ఆ బాలుడికి అమ్మే అన్ని సపర్యలు చేస్తోంది. కూలి పనులు చేసుకునే గుగులోతు చందన్-విజయ దంపతులకు రెండో సంతానంగా జతిన్ జన్మించారు. చిన్నప్పటి నుంచి ఆ బాలుడు నడవలేడు. ఆరేళ్ల క్రితం నిమ్స్ ఆసుపత్రిలో పరీక్షలు చేయించగా జతిన్‌కు కాళ్లు పని చేయవని వైద్యులు చెప్పారు. చేతులు కూడా సరిగ్గా పని చేయవు. దీంతో ఆ బాలుడి తల్లి విజయ చంటిబిడ్డలా చూస్తూ అన్ని పనులు ఆమె చూస్తోంది. అనారోగ్యంతో భర్త మృతిచెందగా కూతురు, కుమారుడి పోషణ కోసం మార్కెట్‌లో కూలి పనిచేస్తోంది. బాలుడికి పింఛన్ కోసం ఎన్నిసార్లు తిరిగినా మంజూరు కాలేదంటూ విచారం వ్యక్తం చేస్తోంది.

మరికొన్ని సమస్యలు...

☛ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న పలువురు ఉద్యోగులకు ఔట్ సోర్సింగ్ నిర్వాహకులు ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని, ఏడాదికి ఈపీఎఫ్ చెల్లించలేదని పలువురు ఉద్యోగులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గట్టిగా నిలదీస్తే ఉద్యోగం నుంచి తొలగిస్తామంటూ బెదిరిస్తున్నారని కలెక్టర్‌కు వివరించారు.

☛ పోడు భూముల పట్టాలు ఇచ్చినా బ్యాంకు అధికారులు పంట రుణాలు మంజూరు చేయడం లేదని ఇనుగుర్తి మండలం రాముతండా, వీరారెడ్డిపల్లి తండా, రూప్లాతండా, పన్యాతండాల రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

☛ తన సోదరి ఉషారాణికి తల్లి దండ్రుల వారసత్వంగా ఉన్న భూమికి పట్టాదారు పాసుపుస్తకాలు ఇప్పిస్తానని బయ్యారం పీఏసీఎస్ అధ్యక్షుడు లక్ష రూపాయలు తీసుకొని చేయలేదని సుంకరి రజని అనే మహిళ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అడిగితే బెదిరిస్తున్నాడని వాపోయారు.

శాఖల వారీగా దరఖాస్తులు:	
కలెక్టరేట్	14
డీఆర్‌డీవో	14
సాంఘిక సంక్షేమం	9
డీపీఆర్‌వో	6
ఎస్సీ కార్పొరేషన్	5
ఆర్డీవో	5
పోలీసు శాఖ	4
వైద్యారోగ్యశాఖ	4
ఇతర	70



రైతు బంధు, కౌలు డబ్బులు వచ్చేలా చేశారు

ములుగు మండలం జాకారం గ్రామానికి చెందిన ఈయన పేరు మామిడిశెట్టి చిన్న మల్లయ్య. ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరికి పెళ్లిళ్లు చేసి ఇళ్ల స్థలాలు, భూములు పంచి ఎకరం భూమిని తమ పోషణ నిమిత్తం ఉంచుకున్నారు. ఆ భూమి పొరపాటున పెద్ద కొడుకు రాజు పేరున పాసుపుస్తకంలో నమోదైంది. దీంతో రైతుబంధు పెద్దకుమారుడికే వెళుతోంది. తండ్రి తన పోషణ నిమిత్తం ఉంచుకున్న భూమిని చిన్న కుమారుడు కౌలుకు చేస్తూ కౌలు డబ్బులు తండ్రికి ఇవ్వడం లేదు. దీంతో మామిడిశెట్టి చిన మల్లయ్య ములుగు ఆర్డీవో సత్యపాల్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారి చట్ట ప్రకారం నోటీసులు జారీ చేశారు. తహసీల్దారు విచారణ జరిపి ఆర్డీవోకు నివేదిక సమర్పించారు. ఇరువురి వాదనలు విన్న ఆర్డీవో మల్లయ్య భూమి అర్జీదారు పేరిట నమోదు చేయడానికి సెప్టెంబరు 9న ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో రైతు బంధు, కౌలు డబ్బులు అర్జీదారుకు చెందేలా మార్గం సుగమమైంది.

ప్రతి నెలా రూ.2 వేలు చెల్లించాలి



వెంకటాపురం మండలం నల్లగుంట గ్రామానికి చెందిన గోదిశాల సమ్మక్కకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. పెద్ద కొడుకు ఉద్యోగరీత్యా హనుమకొండలో ఉంటున్నారు. ఊళ్లో ఆయనకు పంచి ఇచ్చిన ఇంట్లో సమ్మక్క నివాసం ఉంటోంది. చిన్న కొడుకు మరణించిన తర్వాత కోడలు ఆ ఇంట్లో సమ్మక్కను ఉండనివ్వడం లేదు. పెద్ద కుమారుని వాటా కూడా తమకే చెందుతుందని గొడవ పడింది. దీంతో వేరే ఇంట్లో నివాసం ఉంటున్నానని ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఇరువురికి నోటీసులు జారీ చేశారు. వాదనలు విన్న అనంతరం పెద్ద కుమారుడికి వాటాగా ఉన్న ఇంటిలో సమ్మక్క నివాసం ఉండేలా, ఆమె జీవనానికి పెద్ద కుమారుడు రవిందర్, చిన్న కోడలు శ్రీలత నెలకు రూ.2 వేలు ఇవ్వాలని ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి ఆదేశిస్తూ సెప్టెంబరు 19న ఉత్తర్వులు జారీ చేశారు.


పిల్లలను పెంచి.. పెద్దచేసిన తల్లిదండ్రులు వృద్ధాప్యంలో నిరాదరణకు గురవుతున్నారు.. దీంతో మలిదశ వయసులో క్షోభ అనుభవిస్తున్నారు.. బతుకుమార్గం చూపిన అమ్మానాన్నలను కంటికిరెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క బిడ్డ పైన ఉంది. చట్టపరంగా వృద్ధులకు హక్కులు ఉన్నాయి.. నిరాదరణకు గురవుతున్న సందర్భాల్లో న్యాయస్థానాలు అండగా ఉంటున్నాయి.. మంగళవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

వయోవృద్ధులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా టోల్‌ఫ్రీ 14567 నంబరును సంప్రదించాలి.



టోల్‌ఫ్రీ నంబరుపై వృద్ధులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు (పాత చిత్రం)

పోషణ చట్టం.. వృద్ధులకు పట్టం



న్యూస్‌టుడే– హనుమకొండ కలెక్టరేట్, గిర్మాజీపేట, ములుగు

అండగా చట్టాలు..

తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణార్థం, సంరక్షణ ప్రత్యేక చట్టాలు ఉన్నాయి.. హిందూ దత్తత, పోషణ చట్టం-1956 ప్రకారం వృద్ధులైన తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే. చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రేమతో కేసులు వేయడం లేదు. దీంతో వేగవంతమైన సహాయాన్ని అందించేందుకు న్యాయ స్థానాలతో సంబంధం లేకుండా తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం- 2007ను కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. తెలంగాణ ప్రభుత్వం సవరణ నియమావళి-2022ను రూపొందించింది.

దరఖాస్తు ఎవరికి సమర్పించాలి..?

వృద్ధులు, తల్లిదండ్రులు ఎక్కడ నివసిస్తున్నారో, ఇంతకుముందు చివరిసారిగా ఎక్కడ నివసించారో తెలుపుతూ వారి పిల్లలు లేదా బంధువులు ఎక్కడ నివసిస్తారో.. తెలుపుతూ ఆయా జిల్లాలోని రెవెన్యూ డివిజనల్ అధికారి(మెయింటనెన్స్ ట్రిబ్యునల్), జిల్లా సంక్షేమాధికారికి పోషణ ఖర్చుల కోసం దరఖాస్తు చేసుకోవాలి.

90 రోజుల్లో విచారణ

వయోవృద్ధులు దరఖాస్తు చేసుకున్న 90 రోజుల వ్యవధిలో ట్రైబ్యునల్ పిల్లలకు నోటీసులు పంపించి విచారణాధికారులచే వాదనలు, సాక్ష్యాలు సేకరించి పోషణ ఖర్చుల చెల్లింపునకు ఆదేశిస్తుంది. మూడు నెలల పాటు సదరు పిల్లలు పోషణ ఖర్చులు ఇవ్వకపోతే తల్లిదండ్రులు తిరిగి ట్రైబ్యునల్‌ను ఆశ్రయించొచ్చు. ఉత్తర్వులు పాటించని పిల్లలు, బంధువులకు జరిమానా, జైలు శిక్ష విధించే హక్కు దానికి ఉంటుంది. పిల్లలు, బంధువులు పోషణ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే తిరిగి వారి ఆస్తులను స్వాధీనం చేసుకునే హక్కు ఉంటుంది.

☛ నడవలేని వయోవృద్ధులకు వీల్‌ఛైర్, చేతి కర్రలు, ఇతర పరికరాలు, వినికిడి యంత్రాలు, కళ్లజోళ్లు అందజేస్తారు. వృద్ధులు జిల్లా సంక్షేమాధికారికి దరఖాస్తు చేసుకోవాలి. వృద్ధాప్యంలోని తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే. పిల్లలతో ఇబ్బందులు ఎదురైతే జిల్లా సంక్షేమాధికార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని హనుమకొండ జిల్లా ఇన్‌ఛార్జి సంక్షేమాధికారిణి రాజమణి తెలిపారు.

కనీసం తిండి పెట్టకుండా..



స్టాండు సాయంతో మెల్లి దిగుతున్న ఈ వృద్ధుడి పేరు వేల్పుల నర్సయ్య వయసు 90 ఏళ్లు. సంగెం మండలం గవిచర్ల నివాసి.. భార్య ఆగమ్మ అనారోగ్య సమస్యలతో మంచానికే పరిమితమయ్యారు. తన నాలుగెకరాల భూమిలో 2.5 ఎకరాలను కుమారుడు అక్రమంగా పట్టా చేసుకున్నాడు. మిగిలిన భూమి చెరువు శిఖం కింద ఉండి గతంలో ఇద్దరు కుమార్తెలకు పసుపు, కుంకుమ కింద 10 గుంటల చొప్పున రాసిచ్చారు. ఆ భూమిపై కన్నేసిన కుమారుడు తన పేరుపై రాసివ్వాలని ఒత్తిడి తెస్తూ.. తల్లిదండ్రులైన ఇద్దరు వృద్ధులను ఓ చిన్న గదిలో ఉంచి తిండి పెట్టడంలేదు. ఇష్టమొచ్చినట్లు కొడుతున్నాడని కన్నీటి పర్యంతమయ్యారు. తన బాధను గత జులైలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

గిఫ్ట్ డీడ్ రద్దు చేసి..

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం పైడిచింతలపల్లి గ్రామానికి చెందిన గడ్డం బాపిరెడ్డి కుమారుడైన స్వామిరెడ్డికి 6.5 ఎకరాలను గిఫ్ట్ డీడ్ చేశారు. కానీ, వృద్ధాప్యంలో బాగోగులు చూడడం లేదని.. కలెక్టరేట్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్డీవో కుమారుడికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో గిఫ్ట్ డీడ్‌ను రద్దుచేయాలని గత ఆగస్టులో దరఖాస్తు చేశారు. కలెక్టర్ పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి గిఫ్ట్‌డీడ్‌ను రద్దుచేసి తిరిగి తండ్రి పేరిట భూమిని బదిలీ చేయాలని అధికారులను ఆదేశించారు. తండ్రి పోషణకు ప్రతి నెలా రూ.10 వేలు చెల్లించాలని కుమారుడిని ఆదేశించారు.

ఆశ్రమాల్లో ఆదరణ..

నిరాదరణకు గురైన వృద్ధులకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనాథాశ్రమాల్లో సేవలు అందిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20 వృద్ధాశ్రమాలు ఉండగా అందులో సుమారు 474 మంది ఉంటున్నారు.

జిల్లా	ఆశ్రమాలు	వృద్ధుల సంఖ్య
హనుమకొండ	10	252
వరంగల్	05	154
జనగామ	02	30
మహబూబాబాద్	01	12
భూపాలపల్లి	01	10
ములుగు	01	16



నగరంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులు

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి..



-తేరాల యుగంధర్, వయోవృద్ధుల సంక్షేమ సంస్థ కార్యదర్శి

2018లో మేం వయోవృద్ధుల సంక్షేమ సంఘాన్ని స్థాపించాం. జిల్లా స్థాయిలో కలెక్టర్ ఛైర్మన్‌గా ఉన్నారు. చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాం. వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాం. లయన్స్ క్లబ్ సహకారంతో కంటి వైద్య పరీక్షలు చేయిస్తున్నాం. మా పోరాటం వల్లే ఎంజీఎం ఆసుపత్రిలో వృద్ధుల కోసం ప్రత్యేకంగా ఓపీ విభాగం ఏర్పాటు చేశారు.

అవార్డుల స్ఫూర్తితో అభివృద్ధి



మేయర్ సుధారాణికి ధ్రువపత్రం అందిస్తున్న అధికారులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: స్మార్ట్‌సిటీ, నైబర్ హుడ్ ఛాలెంజ్ పోటీల్లో గ్రేటర్ వరంగల్‌కు అవార్డులు రావడం గర్వకారణమని, ఇదే స్ఫూర్తితో అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. ఇటీవల కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణశాఖ ఇచ్చిన 'ఎక్సలెన్స్' ధ్రువపత్రాన్ని సోమవారం రాత్రి బల్దియా ప్రధాన కార్యాలయంలో అధికారులు మేయర్‌కు అందజేశారు. ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈ శ్రీనివాస్, డీఈలు కృష్ణమోహన్, కృష్ణమూర్తి, రంగారావు, ఏఈలు పాల్గొన్నారు.

యువ పరిశోధకులకు ప్రోత్సాహం



ప్రభాకర్ నరేంద్రకుమార్

నెల్లికుదురు, న్యూస్‌టుడే: మిరప పంటను ఆశిస్తున్న నల్లతామర తెగులు నివారణకు పరిశోధనలు చేసి సేంద్రియ ఆధారిత మందులు తయారుచేసిన యువ పరిశోధకులను తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ద్వారా ప్రభుత్వం అందించే రూ.5 లక్షల టీ-స్పార్క్ గ్రాంట్ వరించింది. వివిధ రంగాల్లో పరిశోధనలు చేస్తున్న వారి నుంచి 2024 ఆగస్టులో అంతర్జాలం ద్వారా ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం శ్రీరామగిరి యువకుడు గాజుల ప్రభాకర్, డోర్నకల్ యువకుడు నరేంద్రకుమార్ ఓయూలో ఎంఎస్సీ పీహెచ్‌డీ పూర్తి చేసి శ్రీజీపీఎవెన్ లైఫ్ సైన్సెస్ అనే స్టార్టప్ సంస్థను స్థాపించి పంటలపై ఆశించే పురుగు, తెగుళ్ల నివారణకు పరిశోధనలు చేస్తున్నారు. హైదరాబాద్ ఐకేపీ నాలెడ్జ్ పార్క్ సహాయంతో త్రిప్ క్లియర్ అనే సేంద్రియ ఆధారిత పురుగు మందు రూపొందించారు. టీ-స్పార్క్ వారు పలుమార్లు పరిశీలించి గ్రాంట్‌కు తమ సంస్థను ఎంపిక చేశారని ప్రభాకర్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. తమ ఉత్పత్తిని త్వరలో మార్కెట్లోకి తీసుకురానున్నట్లు వారు వివరించారు.

కాలుష్యపు కోరల్లో.. మంచినీళ్ల చెరువు



రైతు బాలయ్య కుడి చేతి సీసాలో స్వచ్ఛమైన నీరు.. ఎడమచేతిలో కలుషితమైన చెరువు నీరు

వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రం శివారులోని 'మంచినీళ్ల చెరువు' కాకతీయుల కాలం నుంచి గ్రామ ప్రజలకు తాగునీటి వరప్రదాయిని. పంట పొలాలకు సాగు నీరు అందించే ప్రధాన జలవనరు. ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో కళకళలాడిన తటాకం నేడు కోళ్ల పరిశ్రమ వ్యర్థాలతో కాలుష్య కాసారంగా మారింది. సుమారు 115 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు కింద 300 ఎకరాల ఆయకట్టు ఉంది. సుమారు 120 మత్స్యకార కుటుంబాలు ఈ చెరువుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. పదేళ్ల క్రితం వరకు చెరువులో నాణెం వేసినా స్పష్టంగా కనపడేదని స్థానికులు తెలిపారు. తొమ్మిదేళ్ల క్రితం కోళ్ల పరిశ్రమ వెలిసినప్పటి నుంచి మంచినీళ్ల చెరువు కాలుష్యపు కోరల్లో చిక్కుకుంది. పశుపక్ష్యాదులు సైతం ఈ నీటిని తాగలేని పరిస్థితి. గ్రామానికి మంచి నీటిని సరఫరా చేసే బోరు బావులు చెరువులోనే ఉండటంతో.. ఈ నీటిని తాగిన వారు జబ్బుల బారిన పడుతున్నారు. స్నానపానాదులకు ఈ నీటిని వాడినా.. చర్మవ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. కోళ్ల పరిశ్రమ నిర్వాహకులు ఓ కాలువ ద్వారా అర్ధరాత్రి వ్యర్థాలను చెరువులో వదులుతున్నారు. దీనిపై గ్రామస్థులు ఉద్యమం ప్రారంభించారు. గ్రామ పరిరక్షణ కమిటీ పేరిట అధికారులు, ప్రజాప్రతినిధులకు తమ గోడు చెబుతున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో పాలనాధికారి డా.సత్యశారదను కలిసి సమస్య విన్నవించారు.



వరంగల్ కలెక్టరేట్ ఎదుట రాయపర్తి గ్రామ పరిరక్షణ కమిటీ సభ్యులు

– ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే రాయపర్తి

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	110
రిటైల్:	132
డ్రెస్డ్:	191
స్కిన్‌లెస్:	218

మేళతాళాలు.. పూల జల్లుల మధ్య ఉపాధ్యాయులకు వీడ్కోలు

నర్సింహులపేట, న్యూస్‌టుడే: బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు మేళతాళాలు మధ్య పూలు చల్లుతూ, కోలాటాలు వేస్తూ ఆనందోత్సాహాల మధ్య వీడ్కోలు, కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు నర్సింహులపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు. వారం రోజుల కిందట ఇతర పాఠశాలలకు 18 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. పదకొండేళ్లపాటు తమకు చదువులు చెప్పిన గురువులకు వీడ్కోలు సమావేశంలో పూలమాలలు వేసి శాలువా, జ్ఞాపికలతో సన్మానించి కన్నీరుమున్నీరయ్యారు. ఇటీవల పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులను పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నర్సిరెడ్డి, పూర్వ ప్రిన్సిపల్ ఆనంద్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సెమీస్ చేరిన నల్గొండ, మహబూబ్‌నగర్ జట్లు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఓరుగల్లు కేంద్రంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో నల్గొండ, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల జట్లు సెమీస్‌కు చేరాయి. సోమవారం కోమటిపల్లి మైదానంలో వరంగల్, నల్గొండ జట్ల మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న వరంగల్ జట్టు 16.5 ఓవర్లలో 52 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఛేదనలో నల్గొండ జట్టు 19 ఓవర్లలో 53 పరుగులు చేసి విజయం సాధించింది. నల్గొండ బౌలర్లలో యశ్వంత్ 4 వికెట్లు, శ్రీఖర్ 3 వికెట్లు పడగొట్టి విజయంలో కీలకపాత్ర పోషించారు. మొగిలిచర్ల మైదానంలో మహబూబ్‌నగర్, మెదక్ జట్ల మ్యాచ్ జరిగింది. నిర్ణీత 50 ఓవర్లలో మహబూబ్‌నగర్ జట్టు మూడు వికెట్ల నష్టానికి 217 పరుగులు చేసింది. అభిలాష్ 66 పరుగులు, అబ్దుల్ 54 పరుగులు చేశారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన మెదక్ జట్టు 32.1 ఓవర్లలో 127 పరుగులకే ఆలౌట్ అయ్యింది. మంగళవారం నుంచి పూల్ 'బి'లోని కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల మ్యాచ్‌లు ఉంటాయని వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు.

అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ క్రీడలకు ఎంపిక

అడ్డంకిగా మారిన పేదరికం



ప్రతిభకు అవయవలోపం, పేదరికం అడ్డుకాదని నిరూపించారు పలిమెల మండల కేంద్రానికి చెందిన కావేరి జ్యోతి.. అయిదేళ్ల వయసున్నప్పుడే రోడ్డు ప్రమాదంలో కుడి కాలు కోల్పోయారు. ప్లాస్టిక్ కాలు సాయంతో నడుస్తున్నారు. ప్రస్తుతం హనుమకొండ ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నారు. ఇంటర్ చదువుతున్న సమయంలో జేఎన్ స్టేడియంలో జరిగిన పోటీలను చూసి క్రీడల్లో ఆసక్తి పెంచుకున్నారు. సెప్టెంబరు 1న హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ త్రోబాల్ పోటీల్లో పాల్గొని పసిడి పతకాలు సాధించి జాతీయ స్థాయి ఆటలకు ఎంపికయ్యారు. సెప్టెంబరు 22 నుంచి 26 వరకు ఝార్ఖండ్ రాష్ట్రంలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఆడి అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. అంతర్జాతీయ స్థాయి పారా త్రోబాల్ విభాగంలో ఎంపికయ్యారు. డిసెంబరులో కంబోడియా దేశంలో జరిగే అంతర్జాతీయ ఆటల్లో పాల్గొనేందుకు రూ.లక్ష ఖర్చవుతుందని, అక్టోబరు 15లోపు రూ.50,000 చెల్లిస్తేనే అర్హత పొందుతానని ఆమె తెలిపారు. జ్యోతి తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు కావడంతో రూ.లక్ష సమకూర్చడం భారంగా మారింది. దాతలు ఆర్థికసాయం అందించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, పలిమెల(భూపాలపల్లి జిల్లా)

వరికి సుడిదోమ 'పోటు'!

న్యూస్‌టుడే, వరంగల్ వ్యవసాయం



ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరి పంటకు సుడిదోమ సోకి తీవ్రంగా నష్టపరుస్తోంది. ఈ సారి 7.50 లక్షల ఎకరాల్లో సాగైనట్లు అంచనా.. ప్రస్తుతం పొట్ట దశలో ఉంది. భారీ వర్షాల తర్వాత వాతావరణం ఉక్కపోతగా మారడంతో సుడిదోమ ఉద్ధృతి పెరిగినట్లు వ్యవసాయ శాస్త్రవేత్తలు గుర్తించారు. తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మామునూరు కృషి విజ్ఞానకేంద్రం కీటక శాస్త్రవేత్త డా. రాజు, వరంగల్ జిల్లా వ్యవసాయాధికారి కె. అనురాధ రైతులకు సూచించారు. 'పొలాల్లో నీటిపై భాగంలో దోమలు తేలుతూ మొదళ్ల చుట్టూ తిరుగుతూ రసాన్ని పీల్చడంతో ఆకులు పసుపు రంగులోకి మారుతాయి. మొక్క సుడులుగా ఎండిపోతుంది. పొట్ట దశలో ఉద్ధృతి ఎక్కువైతే గింజరాదు. నూకశాతం పెరిగి దిగుబడి పడిపోతుంది. పొలాల్లో తూర్పు, పడమర దిశగా రెండు మీటర్ల దూరంగా పాయలు ఏర్పాటు చేస్తే పంటకు గాలి, వెలుతురు సోకి దోమ ఉద్ధృతి తగ్గుతుంది. పొలంలో నీరు పెడుతూ తీసివేస్తే గుడ్లు, పిల్ల దోమల ఉద్ధృతి తగ్గుతుంది. దోమ కనిపించిన మొదటి దశలో వేపనూనె 1500 పీపీఎం 5 మి.లీ నీటికి కలిపి పిచికారీ చేయాలి. తర్వాత దశలో ట్రైఫ్లుమిజోపైరిమ్ మందును 94 మి.లీ ఎకరానికి పిచికారీ చేయాలి. దోమ ఉద్ధృతి ఎక్కువగా ఉంటే లీటరు నీటికి 1.5 గ్రా. ఎసిఫేట్ 75 ఎస్.పి కలిపి వరి మొదళ్లపై పడేలా పిచికారీ చేయాలి. అప్పటికీ నివారణ కాకపోతే లీటరు నీటికి 0.4 గ్రా. డైనోటెఫ్యూరాన్ 20 ఎస్‌జి లేదా 0.60 గ్రా పైమెట్రోజిన్ 50 డబ్ల్యూజి లేదా ట్రైఫ్లూమెజోపైరిమ్ 0.485 మి.లీ కలిపి పిచికారీ చేయాలి. పొట్ట దశలో యూరియాతో పాటు పొటాష్ కలిపి వేసుకుంటే మొక్కకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని' వివరించారు.



దోమ ఉద్ధృతిని పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్త డా.రాజు

రైతేరాజు

ఉల్లిసాగుకు సమయమిదే...

మెళకువ

గోపాల్‌పూర్, న్యూస్‌టుడే: ఉల్లికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. వినియోగం పెరగడంతో ధరలు కూడా నిలకడగా ఉంటున్నాయి. సాగులో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే.. లాభాలు గడించవచ్చని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా.రాజు తెలిపారు. 'వర్షాకాలంలో నవంబరులోగా విత్తుకునే అవకాశం ఉంది. ఉల్లి సాగుకు ఎకరాకు మూడు, నాలుగు కిలోల విత్తనాలు అవసరమవుతాయి. నేలను బాగా దున్ని 120 సెం.మీ వెడల్పు, 3 మీటర్ల పొడవైన నారుమళ్లను తయారు చేసుకోవాలి. రెండు కిలోల విత్తనం 200 చ.మీ.ల నారుమడికి సరిపోతుంది. విత్తనశుద్ధి చేయాలి. మూడు గ్రాముల కాప్టాన్ లేదా థైరామ్ కిలో విత్తనానికి కలిపి నారుమడిలో పలచగా వరుసల్లో పోయాలి. నారుకుళ్లు తెగులు సోకకుండా పది రోజులకోసారి కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నారు పురుగు ఆశించకుండా కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు నారుమడిలో చల్లి నీరు కట్టాలి. నాటిన 75 రోజుల తర్వాత మాలిక్ హైడ్రజైడ్ 2.5 గ్రా. లీటరు నీటికి ద్రావణాన్ని చల్లడం వల్ల మొలక నష్టం బాగా తగ్గుతుంది. నారునాటిన వంద రోజులకు కార్బండిజమ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే కుళ్లడం చాలా వరకు తగ్గుతుంది. ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువుతో పాటు 80 కిలోల నత్రజని, 30 కిలోల భాస్వరం, 24 కిలోల పొటాష్ ఎరువులను వేయాలి. వేరుశనగ పిండి లేదా ఆముదపు పిండి వేసి, మట్టిని ఎగదోయడం వల్ల ఎక్కువ దిగుబడి వస్తుంది. నత్రజనిని రెండు దఫాలుగా వేసుకుంటే గడ్డ బాగా ఊరుతుంది. నాటిన 60 రోజుల వరకు 15 రోజుల వ్యవధిలో నాలుగు, అయిదు తడులు ఇవ్వాలి. గడ్డ ఊరే దశలో ఏడు రోజుల వ్యవధిలో ఏడు, ఎనిమిది తడులివ్వాలి. కోతకు 15 రోజుల ముందుగా నీరు కట్టడం ఆపాలి. వానాకాలం ఎకరానికి 80 నుంచి 100 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. యాసంగిలో 130 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని' వివరించారు.



డా.రాజు.శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, మామునూరు.



దేవన్నపేటలో సాగుచేసిన ఉల్లి

ప్రశ్న-సమాధానం

? మిరప పంటలో తామర పురుగుల నివారణ చర్యలు తెలపండి..? **-వి.బుచ్చిరెడ్డి. దేవన్నపేట**

✔ తామర పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి రసం పీల్చడంతో పైకి ముడుచుకుంటాయి. దీన్ని నివారించడానికి నాటిన 15, 45, రోజులకు ఎకరాకు 8 కిలోల ఫిప్రోనిల్ గుళికలు తగినంత తేమ ఉన్నప్పుడు వేయాలి. అవసరాన్ని బట్టి ఎసిఫేట్ 1.5 గ్రా. డైమిథియేట్ 2 మి.లీ. లేదా క్లోరోపైరిఫాస్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

-తిరుపతి, ఉద్యానశాఖ అధికారి, వరంగల్



తామర పురుగులు ఆశించడంతో ముడుచుకుపోయిన మిరప మొక్కలు

–న్యూస్‌టుడే, వరంగల్ వ్యవసాయం



గులాబీ.. లాభాల గుబాళింపు

ఎల్కతుర్తి, న్యూస్‌టుడే : మెట్ట ప్రాంతంలో గులాబీ తోట సాగుచేసి కొంత మంది కూలీలకు ఉపాధి కల్పిస్తూ లాభాలు పొందుతున్నారు. మండలంలోనే గులాబీ తోట సాగు చేసి ఆదర్శంగా నిలిచారు.. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం సిర్లపల్లి గ్రామానికి చెందిన రైతు తూముల చక్రధర్‌రావు సుమారు పదేళ్ల కిందట హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం జీల్గుల గ్రామంలో రెండెకరాల భూమి కొనుగోలు చేశారు. అందులో వ్యవసాయం చేస్తున్నాడు. ఎకరంలో వరి, పత్తి సాగు చేశాడు. మిగతా ఎకరంలో సుమారు రూ.4 లక్షలు పెట్టుబడి పెట్టి ఏడాది క్రితం గులాబీ తోట సాగు చేశారు. నెల నుంచి పువ్వులు దిగుబడి తీస్తున్నారు. వారంలో రెండు సార్లు కోసి విక్రయిస్తున్నారు. చెట్లకు మూడు రోజులకోసారి 40 నుంచి 50 కిలోల పూలు పూస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.80 నుంచి రూ.100 వరకు ధర ఉంది. తోట వద్దకు వచ్చేవారికి రూ.100కు కిలో చొప్పున విక్రయిస్తున్నారు. రైతు చక్రధర్ మాట్లాడుతూ... నెల రోజులుగా పూలు పూస్తున్నాయి. పండగల వేళల్లో ధర ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయాధికారుల సూచన మేరకు సస్యరక్షణ చేపడుతున్నాం.. మొక్కలకు దిగుబడి అనంతరం కొమ్మల కత్తిరింపు చేపడుతూ.. పదేళ్ల వరకు పూల దిగుబడి పొందవచ్చని వివరించారు.



చక్రధర్‌రావు



కళ తప్పిన కూడళ్లు!

న్యూస్‌టుడే, డోర్నకల్


ఎన్టీఆర్ సర్కిల్ వెలవెల


బాబు జగ్జీవన్ రామ్ కూడలిలో..

డోర్నకల్ పురపాలక సంఘంగా 2018, ఆగస్టు 2న ఏర్పడింది. పట్టణ సుందరీకరణలో భాగంగా టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.27 లక్షలు వెచ్చించి ఎన్టీఆర్, బాబు జగ్జీవన్‌రామ్ కూడళ్లను అభివృద్ధి చేశారు. ఫౌంటేన్లు నెలకొల్పారు. వీటికి 2019, జూన్ 12న భూమి పూజ జరిగినప్పటికీ అధికారుల అలసత్వం, ప్రజాప్రతినిధుల బాధ్యతారాహిత్యం వల్ల ఇవి పని చేయడానికి మూడేళ్లు పట్టింది. ఆ తర్వాత కొన్నాళ్లకే వాటి నిర్వహణ మరిచారు. చీటికిమాటికి అవి మొరాయిస్తుండటంతో బాగు చేయకుండా వదిలేశారు. దీంతో రెండు కూడళ్లు ఇలా పండగ పూట కళ తప్పాయి. కనీసం బతుకమ్మ, అమ్మవారి ఉత్సవాల నాటికి వీటికి పూర్వ కళ తీసుకొస్తే బాగుంటుందని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు. ఈ విషయాన్ని వార్డు కౌన్సిలరు శీలం భాగ్యలక్ష్మి, పుర కమిషనర్ నరేష్‌రెడ్డి వద్ద ప్రస్తావించగా ఫౌంటేన్లను తక్షణం బాగు చేయించి ఎప్పటిలాగా పని చేసేలా చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు.

నాసిరకం గుడ్ల విక్రయాలు

దంతాలపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని వివిధ గ్రామాల్లో నాసిరకం కోడిగుడ్ల విక్రయాలు జరుగుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉదయం వేళ పలువురు వ్యక్తులు ద్విచక్ర వాహనాలపై గ్రామాల్లో వీధుల వెంట తిరుగుతూ గుడ్లను విక్రయిస్తున్నారు. 30 గుడ్ల ట్రేకు రూ.150 నుంచి రూ.160 వరకు విక్రయిస్తున్నారు. కిరాణా దుకాణాలకు వెళ్లి కొనుగోలు చేయలేని వారంతా వీరి వద్ద కొనుగోలు చేస్తున్నారు. ఈ గుడ్లను ఉడికించడంతో కుళ్లిన వాసనతో పగిలిపోతున్నాయి. తాజాగా కుమ్మరికుంట్లలో ఒకరు ఐదు రోజుల క్రితం కోడిగుడ్లను కొనుగోలు చేశారు. సోమవారం వాటిని ఉడికించగా పనికి రాని విధంగా మారినట్లు తెలిపారు. కుళ్లిన గుడ్లను తిన్నట్లయితే అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని పలువురు భయపడుతున్నారు.


కుమ్మరికుంట్లలో వెలుగు చూసిన కుళ్లిపోయిన కోడిగుడ్లు

3న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్ 10వ ఛాంపియన్‌షిప్ పోటీలకు మహబూబాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 3న జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మైదానంలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బాస నాగమణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 8న హనుమకొండలోని జేఎన్ఎస్ మైదానంలో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు వెళతారని తెలిపారు. ధ్రువపత్రాలతో ఎన్టీఆర్ మైదానంలో ఆరోజు ఉదయం 9 గంటలకు హాజరు కావాలని నాగమణి తెలిపారు.

కుటుంబాలతో సంతోషంగా గడపండి

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: పదవి విరమణ పొందిన పోలీస్ అధికారులు, సిబ్బంది కుటుంబాలతో సంతోషంగా గడపాలని జిల్లా పోలీస్ అధికారి సుధీర్ రాంనాథ్‌కేకన్ అన్నారు. పదవి విరమణ పొందిన కానిస్టేబుల్ బాలరాజు దంపతులను సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పదవి విరమణ పొందిన కానిస్టేబుల్ బాలరాజు దంపతులను సత్కరించారు.

ఒకే గ్రామంలో నలుగురికి ఉద్యోగాలు

కురవి, న్యూస్‌టుడే: డీఎస్సీ ఫలితాల్లో మహబూబాబాద్ జిల్లా కురవి మండలం మోద్గులగూడెం గ్రామానికి చెందిన నలుగురు ఎస్జీటీలో ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించారు. ఇందులో వీరేందర్ 74.40 మార్కులతో జిల్లా స్థాయిలో 18వ ర్యాంకు సాధించగా అతని భావ మరిది కొత్త కరుణాకర్ 74.04 మార్కులతో 66వ ర్యాంకు సాధించారు. అదే గ్రామంలో దుబాకుల వినోద్ 77.57 మార్కులతో 30వ ర్యాంకు, తుపాకుల కావ్య 77.57 మార్కులతో 31వ ర్యాంకు సాధించారు. ఒకే గ్రామంలో నలుగురికి ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు రావడంపై హర్షం వ్యక్తమవుతోంది.

రెండు ఉద్యోగాలు సాధించిన గీత



తొర్రూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం వెలువరించిన డీఎస్సీ ఫలితాల్లో జిల్లాలో 3వ ర్యాంక్ సాధించి సత్తాచాటారు తొర్రూరు మండలంలోని చెర్లపాలెం గ్రామానికి చెందిన దొంతోజు గీత. స్కూల్ అసిస్టెంట్ తెలుగు విభాగంలో మూడోర్యాంక్, భాషా పండితుల విభాగంలో నాలుగో స్థానం కైవసం చేసుకున్నారు. ప్రస్తుతం మహబూబాబాద్ బాలికల బీసీ గురుకుల పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఆమె మెట్టినిల్లు సూర్యాపేట జిల్లా శాలిగౌరారం మండలం చిత్తలూరు. ఈ సందర్భంగా ఆమెను కుటుంబ సభ్యులు అభినందిస్తున్నారు.

ఇది బడే!



డోర్నకల్, న్యూస్‌టుడే: మండలంలోని కన్నెగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం ఖాళీ బీరు బాటిళ్లు ఉండటం చూసి విద్యార్థులు, ఉపాధ్యాయులు కంగుతిన్నారు. రాత్రి వేళల్లో కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల ఆవరణలోకి వెళ్లి మద్యం తాగుతున్నట్లు సమాచారం తెలిసింది. వీరిని కట్టడి చేయడానికి చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు

ఎస్సారెస్పీ జలాలు విడుదల

దంతాలపల్లి, న్యూస్‌టుడే: ఎస్సారెస్పీ డీబీఎం-60 ప్రధాన కాలువకు అధికారులు ఎస్సారెస్పీ జలాలను విడుదల చేశారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం రిజర్వాయర్ నుంచి ప్రధాన కాలువకు 2100 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, తొర్రూరు మండలం పటేల్‌గూడెం వద్ద డీబీఎం-60 ప్రధాన కాలువకు 800 క్యూసెక్కుల నీటిని వదిలినట్లు నీటిపారుదల శాఖ డీఈ వినయ్ తెలిపారు. వరి పంటకు కీలకమైన సమయంలో నీటిని విడుదల చేయడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని రోజులపాటు నీటి విడుదల కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.


దంతాలపల్లిలో కాలువ నిండా..

‘పేదలను విస్మరిస్తున్న ప్రభుత్వం’

కురవి, న్యూస్‌టుడే: కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు తలొగ్గి పేదలను పూర్తిగా విస్మరిస్తోందని సీపీఎం మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. సోమవారం కురవి మండలం తట్టుపల్లిలో సీపీఎం గ్రామ శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. నిత్యావసర సరకుల ధరలు పెరుగుదల, మైనార్టీలపై దాడులు ఎక్కువయ్యాయన్నారు. సభలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాజు, మండల కార్యదర్శి కోటయ్య, సైదులు, మల్లయ్య, వీరయ్య, సుశీల, ఉపేంద్ర పాల్గొన్నారు. పార్టీ నూతన గ్రామ కార్యదర్శిగా యాతం శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

కాంగ్రెస్ నాయకుడు నూకలకు అస్వస్థత

మరిపెడ, న్యూస్‌టుడే: మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెనికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నూకల్ నరేష్‌రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. రెండు రోజుల క్రితం గుండె సంబంధిత అనారోగ్యానికి గురైన ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం రాష్ట్ర మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మహబూబాబాద్ మాజీ పార్లమెంటు సభ్యురాలు మాలోతు కవిత, పలువురు రాజకీయ, వ్యాపార, వాణిజ్య ప్రముఖులు ఆయనను పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

సౌండ్ బాక్సు వితరణ



డోర్నకల్, న్యూస్‌టుడే: డోర్నకల్ మండలం చిల్కోడు ఆదర్శ పాఠశాలకు ఓ విద్యార్థిని తండ్రి రావుల ఉపేందర్ సౌండ్ బాక్సు అందించి వితరణ చూపారు. కూతురు నవ్య ద్వారా పాఠశాల అవసరాన్ని తెలుసుకుని దీనిని బహూకరించారు ప్రిన్సిపల్ కృష్ణభాను సోమవారం ఆయనను అభినందించారు. విద్యార్థుల తరపున దాతకు చప్పట్లతో కృతజ్ఞతలు తెలిపారు.

సభ్యత్వ నమోదు

చిన్నగూడూరు, న్యూస్‌టుడే: జన విజ్ఞాన వేదిక సభ్యత్వాన్ని మండల కేంద్రంలో సోమవారం నిర్వహించారు. తహసీల్దార్ మహబూబ్ అలీ, సీఐ రాజుకుమార్, ఎస్సై యూన్సీ, ఎంఈవో రవి కుమార్‌లకు సభ్యత్వాన్ని అందించినట్లు జక్కి నాగేశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కల్చరల్ సెక్రటరీ దయానంద్, సభ్యులు చక్రధర్, ఉపాధ్యాయులు తదితరుల పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ఈ పుస్తకాల పంపిణీ

మానుకోట,న్యూస్‌టుడే: జాతీయ ప్రతిభా ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్ఈ)కు సిద్ధమవుతున్న జిల్లా కేంద్రంలోని శనగపురం జడ్పీ ఉన్నత పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థులకు తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్కా, స్ఫూర్తి ఎడ్యుకేషనల్ సొసైటీ సమితి ఆధ్వర్యంలో సోమవారం పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు దాశరథి శ్రీధర్, స్ఫూర్తి ఎడ్యుకేషన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రామసహాయం శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణయ్య, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెరటికోళ్ల పెంపకంపై అవగాహన

పెద్దవంగర, న్యూస్‌టుడే: పాడిగేదెలు, పెరటికోళ్ల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందజేస్తుందని, మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఏపీఎం రమణాచారి, మండల పశు వైద్యాధికారి చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని తులసి మండల సమాఖ్య కార్యాలయంలో పెంపకంలో భాగంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. మండలంలో గేదెల పెంపకం 21 యూనిట్లు, పెరటికోళ్ల పెంపకం 82 యూనిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. సీసీలు పద్మమ్మ, సుజాత, సుధాకర్, అనీల్, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన

పెద్దవంగర, న్యూస్‌టుడే: మండలంలోని బొమ్మకల్, రెడ్డికుంట తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సామర్థ్యాలను మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం, తరగతి గదులను పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తిరుపతి రెడ్డి, రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై విచారణ చేపట్టరూ..

నెల్లికుదురు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఓ బ్యాంకులో కొనసాగుతున్న కార్యకలాపాలపై విచారణ చేపట్టాలని కొందరు వ్యక్తులు సోమవారం సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారు. సదరు బ్యాంకు అధికారులు, మధ్య దళారులతో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఉన్నత అధికారులు స్పందించి విచారణ చేపట్టాలని కోరారు. దీనిపై బ్యాంక్ అధికారితో ‘న్యూస్‌టుడే’ వివరణ కోరగా తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు.

ఇసుక వేలంతో ఆదాయం

నర్సింహులపేట, న్యూస్‌టుడే: అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను వేలం వేయగా ప్రభుత్వానికి రూ.10,500 ఆదాయం వచ్చినట్లు తహసీల్దార్ నాగరాజు పేర్కొన్నారు. ఆకేరువాగు నుంచి అక్రమంగా తరలించి బొజ్జన్నపేట గ్రామంలో నిల్వ చేసిన సుమారు 5ట్రిప్పుల ఇసుకను పోలీసులు, అధికారులు సీజ్ చేశారు. గ్రామస్థుల సమక్షంలో సీజ్ చేసిన ఇసుక డంపులను సోమవారం బహిరంగ వేలం నిర్వహించామన్నారు.

నాయకుల త్యాగాలతోనే ఎరుకలకు రిజర్వేషన్

మహబూబాబాద్, న్యూస్‌టుడే: ఎరుకలను గిరిజన తెగలో చేర్చాలని అనేక సంవత్సరాలుగా తమ సంఘం నాయకులు చేసిన త్యాగాల ఫలితంగానే 1976 సెప్టెంబరు 30న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఎరుకలను ఎస్టీ జాబితాలో చేర్చారని తెలంగాణ ప్రదేశ్ ఎరుకుల సంఘం జిల్లా అధ్యక్షుడు పేరం వీరస్వామి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని నెహ్రూసెంటర్‌లో ఆ సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. రిజర్వేషన్ కోసం పోరాడిన అమరులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కోట ఎల్లేష్, మండల అధ్యక్షుడు దాసరి వీరన్న, కట్ట వెంకన్న పాల్గొన్నారు.

మతోన్మాద విధానాలపై ఉద్యమిద్దాం

గార్ల, న్యూస్‌టుడే: భాజపా ప్రభుత్వం అవలంబిస్తున్న మతోన్మాద విధానాలపై ఉద్యమించాలి సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. సీతంపేటలో సోమవారం రాజారావు అధ్యక్షతన మహాసభను నిర్వహించారు. మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్, నాయకులు హరి, వెంకటేశ్వర్లు. బాబు, రామకృష్ణ, అలవాల సత్యావతి తదితరులు ఉన్నారు.

ఇష్టానుసారంగా ఆటోల నిలుపుదల



తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఆటోవాలాలను నియంత్రించే వారు కరవయ్యారు. ఇష్టానుసారంగా రోడ్ల పైన ఎక్కడపడితే అక్కడ నిలుపుతూ ప్రయాణికులు, ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. ముఖ్యంగా బస్టాండ్, కూరగాయల మార్కెట్, పెద్దచెరువుకు వెళ్లేరోడ్లలో సమస్య అధికంగా ఉంది. కట్టడి చేయాల్సిన పోలీసులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని, సమస్యను పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. – తొర్రూరు, న్యూస్‌టుడే

ఉపాధ్యాయురాలిపై మరో ఉపాధ్యాయుడి బంధువుల దాడి

నెల్లికుదురు, న్యూస్‌టుడే: మండలంలోని ఓ తండా ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించి ఇంటికి వెళుతున్న ఓ ఉపాధ్యాయురాలిపై, మరో తండా ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడి బంధువుల దాడి చేసిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మదనతుర్తి రెవెన్యూ గ్రామ శివారులోని ఓ తండా ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయురాలు సోమవారం విధులు ముగించుకొని, ద్విచక్రవాహనంపై తొర్రూరుకు వెళుతున్నారు. ఆమె మండల కేంద్రానికి చేరుకోగానే, మరో ఉపాధ్యాయుడి సోదరుడు ఉపాధ్యాయురాలి ద్విచక్ర వాహనం తాళం చెవి తీసుకొని అడ్డుకున్నాడు. అక్కడే ఉన్న ఉపాధ్యాయుడి సతీమణి, తల్లి, అత్త ముగ్గురు కలిసి, సదరు ఉపాధ్యాయురాలి పై మూకుమ్మడిగా దాడి చేసి వస్త్రాలు చించివేశారు. దాడిని అడ్డుకోవడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని ఉపాధ్యాయురాలిని, ఉపాధ్యాయుడి బంధువులను ఠాణాకు తరలించారు.

మూడు దుకాణాల్లో చోరీ

మరిపెడ, న్యూస్‌టుడే: మరిపెడ పట్టణంలోని ప్రధాన జాతీయ రహదారిపై మూడు దుకాణాల్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఎస్సై గంధ్ర సంతోష్ పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి. వ్యాపారులు రాత్రి సమయంలో దుకాణాలు బంద్ చేసి పై అంతస్తుల్లోని నివాస గృహాల్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో చోరీ జరిగింది. దుండగులు వ్యాపార కేంద్రాల వెనుక వైపు తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి కౌంటర్లలో ఉన్న రూ.10వేల నగదు, సీసీ కెమెరాల హార్డ్ డిస్క్‌లతో కూడిన డీవీఆర్ బాక్స్‌లు అపహరించారు. లక్ష్మీశ్రీనివాస ఎరువులు, పురుగుమందుల దుకాణం, వెంకటేశ్వర ఐరన్, హార్డ్‌వేర్ దుకాణంతోపాటు పక్కనే ఉన్న ధనలక్ష్మి ఐరన్ హార్డ్ వేర్ దుకాణాల్లో చోరీ జరిగింది. బాధితులు గోంద్రాల శ్రీనివాస్, యరమళ్ల మహేష్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వివాహితపై లైంగిక వేధింపులు

మరిపెడ, న్యూస్‌టుడే: వ్యవసాయ క్షేత్రాల వద్ద ఒంటరిగా ఉన్న వివాహితపై అదే తండాకు చెందిన మరో రైతు లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన మరిపెడ మండలం గుర్రప్పతండాలో చోటుచేసుకుంది. ఎస్సై సతీష్ పేర్కొన్న వివరాల ప్రకారం తండాకు చెందిన వివాహిత వ్యవసాయ క్షేత్రం వద్ద పనిచేసుకుంటుండగా పరిసర వ్యవసాయ క్షేత్రానికి చెందిన బానోతు రమేష్ ఆమెను తన కోరిక తీర్చాలంటూ తరచూ వేదింపులకు గురిచేస్తుండటంతో బాధితురాలు పోలీసులకు పిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టిప్పర్‌ను ఢీకొని ఒకరికి గాయాలు

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: రహదారిపై ఆగి ఉన్న టిప్పర్ వాహనాన్ని ఢీకొట్టి ఒకరు తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం రాత్రి మహబూబాబాద్ శివారు శనిగపురం సమీపంలోని మహబూబాబాద్-తొర్రూరు రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నగూడూరు మండలం జయ్యారం గ్రామానికి చెందిన ఎల్ది.నరేష్ ద్విచక్రవాహనంపై మహబూబాబాద్ నుంచి ఇంటికి వెళ్తున్నాడు, ఈ క్రమంలో శనిగపురం సమీపంలో రహదారి పక్కనే ఆగి ఉన్న టిప్పర్ వాహనం ఉన్నది గమనించక పోవడం వల్ల ప్రమాదానికి గురైయ్యారు. తీవ్ర గాయాలైన నరేష్‌ను మహబూబాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న రూరల్ ఎస్సై దీపికారెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

నాటికలతో శాస్త్రీయ చైతన్యం


ప్రథమ స్థానం పొందిన నాటిక ప్రదర్శన విద్యార్థులతో జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, అధ్యాపకులు

మానుకోట,న్యూస్‌టుడే: నాటికలు ఇతర కళా, సాంస్కృతిక రూపాల ప్రదర్శనలతో ప్రజల్లో శాస్త్రీయ చైతన్యాన్ని కలిగించవచ్చని జిల్లా సైన్స్ అధికారి బి.అప్పారావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో జిల్లాస్థాయి సైన్స్ నాటిక పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అప్పారావు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు అభిరుచి ఉన్న సాహితీ కళా రంగాల్లో పాల్గొని విషయాలపై సృజనాత్మకతను ప్రదర్శించాలని తెలిపారు. నీటి సమస్యలు, కృత్రిమమేధ, శాస్త్ర సాంకేతికత, వాతావరణ మార్పులు, ఆరోగ్యం, పరిశుభ్రత అంశాలపై సందేశాత్మక నాటికలను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ పోటీల్లో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను ఏకశిల ఏంజెల్స్ హైస్కూల్, మహబూబాబాద్, కేజీబీవీ, పెద్దవంగర, జడ్పీ బాలికోన్నత పాఠశాల, మహబూబాబాద్ సాధించాయి. పోటీలకు అధ్యాపకులు కె.సోమకృష్ణ, బి.సంతోశ్, కె.సంతోశ్, టి.భాస్కర్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఉపేందర్‌రావు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీ నాయక్

గూడూరు, న్యూస్‌టుడే: వైద్యులు ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధవహించాలని ఎమ్మెల్యే మురళీ నాయక్ అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో వరంగల్ జిల్లా నెక్కొండ మండలానికి చెందిన సంపత్ రెడ్డి, శేశ్యరెడ్డి డెక్కన్ ఫైన్ కెమికల్స్ సంస్థ సహకారంతో అందించిన డిజిటల్ ఎక్స్-రే మెషీన్‌ను సోమవారం ప్రారంభించారు. మురళీ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని మారుమూల గ్రామాలకు వైద్య సదుపాయాలను అందించే విధంగా పని చేస్తుందన్నారు. 30 పడకల ఆసుపత్రిని 50 పడకలకు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని వైద్యులు ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందించారు. అనంతరం సీహెచ్‌సీ ప్రాంగణంలో ఎమ్మెల్యే మెక్క నాటారు. కార్యక్రమంలో డీసీహెచ్‌వో వెంకట్రాములు, ఎంపీడీవో వీరస్వామి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెగా ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోండి

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: ఈనెల 8న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఏ.బి వేడుకల మందిరంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా ఉద్యోగ మేళను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్‌కేకన్ అన్నారు. సోమవారం పోలీస్ కార్యాలయంలో అధికారులతో కలిసి ఎస్పీ గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ నెల 8న జిల్లా కేంద్రంలోని ఏ.బీ వేడుకల మందిరంలో మేళా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. త్రెడ్జ్ ఐటీ గ్రూమింగ్ ఎక్సలెన్స్ సంస్థ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఉద్యోగ మేళాలో 40కి పైగా కంపెనీలు పాల్గొననున్నట్లు చెప్పారు. పది, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ ఎంబీఏ, ఎంసీఏ బీటెక్, ఫార్మసీ విద్యార్హత కలిగిన యువతీ పాల్గొనాలని కోరారు. ఈ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు గోడ పత్రికలోని స్కానర్ ద్వారా స్కాన్ చేస్తే బయోడెటా ఫాం ఉంటుందని, అందులో వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ జోగుల చెన్నయ్య, డీఎస్పీలు తిరుపతిరావు, శ్రీనివాస్, సీఐలు పి.దేవేందర్, సర్వయ్య, చంద్రమౌళి, త్రెడ్జ్ ఐటీ గ్రూమింగ్ ఎక్సలెన్స్ సంస్థ ప్రతినిధులు చందర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిశీల ఉద్యమాలకు దిక్సూచి పీడీఎస్‌యూ

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: ప్రగతిశీల ఉద్యమాలకు పీడీఎస్‌యూ దిక్సూచి అని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబర్ 24న ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించే పీడీఎస్‌యూ అర్ధశతాబ్ది ఉత్సవ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, నాయకులు మహేష్, విజయ్, అల్తాఫ్, జయంత్, దినేష్, సాగర్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు మధు

ఉన్నత ఫలితాలు సాధించాలి

కేసముద్రం, న్యూస్‌టుడే: కల్వల ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఉన్నత ఫలితాలు సాధించి ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలవాలని కేసముద్రం వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ గంట సంజీవరెడ్డి అన్నారు. ఆదర్శ పాఠశాలలో పనిచేసిన ప్రిన్సిపల్ రూపాస్, 17మంది అధ్యాపకులు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో 20 మంది అధ్యాపకులు బదిలీపై వచ్చారు. పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వీడ్కోలు పలుకుతూ ఘనంగా సన్మానించారు.


మార్కెట్ ఛైర్మన్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

అవసరాలకు నిధులు ఉపయోగించుకోండి

మహబూబాబాద్, న్యూస్‌టుడే: జాతీయ ఆరోగ్య పథకం అమలు కోసం అత్యవసరాలకు నిధులను ఉపయోగించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మురళీధర్ కోరారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులకు హాజర్ కావాలని ఉద్యోగులు, ఇతర సిబ్బంది ఉద్యోగ వివరాలను సర్వీస్ పుస్తకంలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రమీలారావు, వలీఅహ్మద్, సుధీర్‌రెడ్డి, సారంగపాణి, నాగేశ్వర్‌రావు, రవీంద్రరావు, కేవీ.రాజు, వి.రామకృష్ణ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు అవసరం


మహాసభలో మాట్లాడుతున్న ఉపేందర్

బయ్యారం, న్యూస్‌టుడే: రవాణా, నిత్యావసర వస్తువుల సరఫరాలో కీలకపాత్ర పోషిస్తున్న హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో బయ్యారం, కారుకొండ హమాలీ శాఖల మహాసభ సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హమాలీ కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో పురుషోత్తం, శ్రీను, వెంకన్న, మోహన్, బాబులాల్, హనుమంతు పాల్గొన్నారు.

డీఈగా పదోన్నతిపై బదిలీ

మహబూబాబాద్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ పురపాలక సంఘంలో ఏఈగా విధులు నిర్వహిస్తున్న బోడ సురేష్ డీఈగా పదోన్నతి కల్పించి కోరుట్లకు బదిలీచేస్తూ పురపాలక ప్రజారోగ్యశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పదోన్నతిపై వెళుతున్న డీఈని ప్రజా ప్రతినిధులు, సిబ్బంది అభినందించారు.

ఆ ఇద్దరు యువకుల మరణం సాధారణమే!

నర్సింహులపేట, న్యూస్‌టుడే: మండలంలోని రామన్నగూడెంలో జూన్ 10న మిత్రుడి పుట్టిన రోజు వేడుకలకు హాజరైన ఇద్దరు 10 రోజుల తరువాత ఒకేసారి మరణించడం సాధారణమేనని తేలింది. వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ జులై 3 అర్ధరాత్రి బోగోజు శ్రావణ్(25), 4వ తేదీ తెల్లవారుజామున ఎస్‌కె రహీమ్‌పాషా(26) మృతి చెందగా మరో యువకుడు ఉపేంద్రాచారి చికిత్స పొందుతూ ప్రాణాలతో బయటపడ్డారు. మిస్టరీగా మారిన వీరి మృతిపై 88 రోజులకు మిస్టరీ వీడింది. గ్రామస్థులు, కుటుంబసభ్యులు, మృతుల బంధువులు కల్తీ మద్యం లేదా కల్తీ కల్లు వల్ల మరణించి ఉంటారని పలు అనుమానాలు వ్యక్తపరచారు. వారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై గంద్రాతి సతీష్ అనుమానాస్పద స్థితి మృతిగా కేసు నమోదు చేశారు. యువకుల మరణంపై సమగ్ర విచారణ జరిపించాలని గ్రామస్థులు పట్టుబట్టడంతో ఎక్సైజ్, పోలీసు అధికారులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేశారు. చికిత్స పొందిన ఆసుపత్రుల్లో వైద్యుల నివేదికలు సేకరించి వైద్యాధికారుల వాంగ్మూలం రికార్డు చేసుకున్నారు. ఈనేపథ్యంలో పోస్టుమార్టం నివేదికలో యువకుల శరీరంలో ఎలాంటి విష పదార్థాలు లేవని, సాధారణంగానే మృతి చెందారని నిర్ధారించినట్లు ఎస్సై మాలోతు సురేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ ఫోరెన్సిక్ సైన్సు ల్యాబొరేటరీ పరీక్షల నివేదికను మృతుల తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. గ్రామ ప్రజలు ఎలాంటి అపోహలు చెందవద్దన్నారు.

రక్షణ మోకులపై అవగాహన

దంతాలపల్లి, న్యూస్‌టుడే: ఆబ్కారీ, బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం దంతాలపల్లిలో కల్లుగీత కార్మికులకు రక్షణ మోకులపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి నర్సింహారావు హజ్జరై ప్రారంభించారు. కల్లుగీత కార్మికులకు సేఫ్టీ మోకుల వినియోగం, పద్ధతులపై వివరించారు. ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు మోకు కిట్లను అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం నేతలు వెంకన్న, మోహన్, శ్రీను, లింగయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటమే శరణ్యం

మహబూబాబాద్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై పోరాడే వారు కమ్యూనిస్టులేనని పేదలకు అండగా ఉండే ఎర్రజెండా స్ఫూర్తితో ఉద్యమాలను నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సూర్నపు సోమయ్య అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని హనుమంతునిగడ్డలో నిర్వహించిన ఎనిమిదో శాఖ మహాసభ నిర్వహించారు. సీపీఎం పార్టీని బలోపేతం చేసి ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ పతాకాన్ని సీనియర్ నేత వెలిశాల బ్రహ్మాచారి ఆవిష్కరించారు. మృతి చెందిన అమరులకు సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో చంద్రమౌళి, వెంకన్న, రాజమౌళి, నాగన్న, భిక్షపతి, బసవయ్య, రామ్మూర్తి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సూర్నపు సోమయ్య